క్లుప్తంగా

పోలింగ్ కేంద్రం తనిఖీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని సత్యనారాయణపురంలోగల ఎస్టీవీఆర్ మున్సిపల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం పరిశీలించారు. స్కూల్ ప్రాంగణంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి ఎన్నికల నిర్వహణకు ఎటువంటి సమస్యలు, ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించే విధంగా ఏమీ ఉండకూడదని అధికారులను హెచ్చరించారు.

ఎంసీఎంసీ, సోషల్ మీడియా విభాగాలను సందర్శించిన కలెక్టర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించే క్రమంలో తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను కలెక్టర్ ఢిల్లీరావు శనివారం సందర్శించారు. జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ), సోషల్ మీడియా సెల్, గ్రీవెన్సుల పరిష్కార కమిటీ తదితర విభాగాల అధికారులు, సిబ్బందితో ఆయన మాట్లాడారు. నియమ నిబంధనలపై పూర్తిస్థాయిలో అవగాహనతో అప్రమత్తత, నిబద్ధతతో పని చేయడం ద్వారా ఎన్నికలను విజయవంతం చేయడంలో కీలక భాగస్వాములు కావచ్చని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని వివరించారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కలరా హాస్పటల్ ప్రాంతానికి చెందిన భరణి భవానీకి రెండేళ్లగా మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. ఈ నెల 13వ తేదీన చర్చికి వెళ్లి వస్తానని చెప్పిన భవానీ ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన చెల్లెలు పప్పు వెంకట రమణ చుట్టు పక్కల, బంధువుల ఇంట విచారించింది. అయినా భవానీ జాడ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా శనివారం కేసు నమోదు చేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

విస్సన్నపేట: విస్సన్నపేటకు చెందిన మేకల సత్యనారాయణ (54) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. శుక్రవారం స్కూటీపై వెలుతుండగా స్థానిక శ్రీరామ్‌థియేటర్ సమీపంలో కారు ఢీ కొట్టడంతో 108 సిబ్బంది నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సత్యనారాయణ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్

పెనమలూరు: గంజాయి కేసులో తప్పించుకోని తిరుగుతున్న నిందితుడిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు శనివారం వివరాలు తెలుపుతూ గంజాయి కేసులో తప్పించుకోని తిరుగుతున్న మచిలీపట్నం ఈడేపల్లికి చెందిన తంగెళ్ల నవీన్ కుమార్‌ను అరెస్ట్ చేశామన్నారు. అతడిని కోర్టులో హాజరు పర్చగా కోర్టు 14 రోజులు రిమాండ్ విధించిందని తెలిపారు. గంజాయి సేవించినా, విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రామారావు హెచ్చరించారు.

నున్నలో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు శైవాగమ ప్రకారం శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం దీక్షాధారణ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రభిషేకం, హోమశాల ప్రవేశం జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి పూజాధికార్యక్రమాలు విశేషంగా తిలకించి నీరాజన తీర్థప్రసాద కార్యక్రమాల్లో విశేషంగా పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్. అరుణ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు ఎం.ఫణికుమార్ నేతృత్వంలో సాంప్రదాయబద్ధంగా జరిగాయి. సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

మానవ జీవనానికి స్ఫూర్తి రంజాన్ మాసం



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఆసిఫ్ ఇతర కార్పొరేటర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సరైన మానవ జీవన విధానాన్ని రంజాన్ మాసం స్ఫూర్తినిచ్చి ఆచరించమని చెబుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని వించిపేట షాహిమసీదు ప్రాంగణంలో స్థానిక కార్పొరేటర్ అర్షద్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఇఫ్తార్ కార్యక్రమంలో ఆసిఫ్ పాల్గొన్నారు. పలువురు ముస్లిం కార్పొరేటర్లు, ప్రముఖులతో కలిసి ఇఫ్తార్‌ను స్వీకరించారు. అదేవిధంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం మసీదు బయట ఆయనను కలిసిన మీడియాతో మాట్లాడారు. ఇస్లాం జీవన విధానంలో రంజాన్ మాసం అత్యంత కీలకమైనదని చెప్పారు. పేద, ధనిక వర్గాల మధ్య తారతమ్యం లేకుండా చూడాలని ఇస్లాం చెబుతుందన్నారు. అందువలనే రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలను వివరిస్తుందని పేర్కొన్నారు. టీడీపీ కూటమి ముస్లిం మైనార్టీలను తీవ్రంగా మోసం చేస్తుందని ధ్వజమెత్తారు. ముస్లింల అభ్యున్నతిని దెబ్బతీసేందుకు టీడీపీ, జనసేనలు బీజేపీతో కూటమిగా కలిసి కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. టీడీపీ కూటమిని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి అండగా నిలిచే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, 41వ డివిజన్ కార్పొరేటర్ ఇర్ఫాన్, పార్టీ మైనార్టీ సెల్ నగర అధ్యక్షులు నాహిద్, అంజుమన్ సంస్థ కార్యదర్శి అబ్దుల్ వాహెబ్, నాయకులు అబ్దుల్ వహాబ్, బాజీ బాబా, జీఎంసి అల్తాఫ్, అమనుల్లా, సుభాని, యునస్, సుభాని ఖాన్ గౌసి, కాజా, అలీ, అజీజ్, హుస్సేన్ షరీఫ్, ఇక్బాల్, బాషీ నజీర్ పాల్గొన్నారు.

మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న డాక్టర్ దూళిపాళ రామకృష్ణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రతినబూనాలని మారిస్ స్టెల్లా కళాశాల సంస్కృత విభాగాధిపతి డాక్టర్ దూళిపాళ రామకృష్ణ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో మాతృభాషా పరిరక్షణ అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో అత్యధికంగా మాట్లాడే భాష తెలుగేనన్నారు. తమిళనాట సైతం తెలుగువారు అత్యధికంగా ఉన్నారని చెప్పారు. అయితే తెలుగువారు తమ జీవన విధానం కోసం భాషను వదులుకుంటున్నారని అది సరైనది కాదని పేర్కొన్నారు. ఎక్కడ ఉన్నా భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భాష పట్ల గౌరవం ఉండాలని, నా భాష చాలా గొప్పది అనే భావనతో ముందుకు సాగాలని తెలిపారు. తెలుగునాట మాతృభాషపై సరైన గౌరవం లేకపోవటం వలనే జ్ఞానపీఠ పురస్కారాలు కేవలం ముగ్గురు మాత్రమే సాధించగలిగారని, కన్నడనాట అధికంగా వచ్చాయని వివరించారు. భాష పట్ల విద్యార్థులు ప్రేమను పెంచుకోవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధి అవకాశాల కోసం ఆంగ్లంపై పట్టు సాధించినా మాతృభాషను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. మాతృభాష కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తెలుగు భాషా వైభవం చాలా గొప్పదని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ జి.నాగరాజు, అధ్యాపకులు ఆర్.జితేంద్రకుమార్, వెన్నపూస పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల ప్రతిభను ప్రోత్సహించాలి



సుధాశ్రీనివాస్‌ను సత్కరిస్తున్న రమాసత్యనారాయణ, విజయలక్ష్మి, నరసింహారావు తదితరులు

విజయవాడ కల్చరల్: కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని విశ్వమాత చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. డ్రీమ్ ఆడియో, మహానటి సావిత్రి కళాపీఠం ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సంగీత విద్వాంసురాలు సుధాశ్రీనివాస్‌కు ఆత్మీయ సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాసత్యనారాయణ మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులని వారికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంటుందన్నారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ సుధారాణి దేశ విదేశాల్లో వందలాది సంగీత కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. డ్రీమ్ ఆడియో అధినేతత చావా నరసింహారావు సంస్థ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, కళా సాంస్కృతిక రంగాల ప్రముఖులు చింతకాయల చిట్టిబాబు, ఉమాబలరాం, ప్రసూనారామన్, మహ్మమద్ ఖాజా, బొడి ఆంజనేయరాజు, అశోక్‌ఆనంద్ సుధాశ్రీనివాస్ సంగీత సేవలను వివరించారు. నిర్వాహకులు సుధాశ్రీనివాస్‌ను ఆత్మీయంగా సత్కరించారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు.

పేద ముస్లింలకు సేమ్యా పంపిణీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం చిట్టినగర్ ఈద్గామహాల్‌లో పేద ముస్లింలకు సేమ్యా పంపిణీ జరిగింది. 48వ డివిజన్ మైనార్టీ అధ్యక్షులు షేక్. మీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పంపిణీ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు షేక్ గౌస్‌మొహిద్దీన్, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నాయకులు కరిముల్లా, డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ప్రతి ఒక్కరూ పేదలను ఆదుకోవాలని, అప్పుడే దేవుని కృపకు పాత్రులవుతామని పేర్కొన్నారు. ప్రవక్త చూపిన మార్గంలో నడవాలని బోధించారు. రంజాన్ పండుగను ప్రతి ఒక్కరు సంతోషంగా జరుపుకోవాలనే భావనతో తన వంతుగా సేమ్యాను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మహిళా విభాగం సెక్రటరీ వరలక్ష్మీ, ఆవాజ్ ముస్లిం ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ



కొండ ప్రాంతంలో అవగాహనా ర్యాలీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ ఏ శ్రీనివాసరాజు అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తపేట షేక్ రాజాసాహెబ్ ప్రభుత్వ వైద్యశాల, అర్బన్ హెల్త్ సెంటర్ ఇతర వైద్య విభాగాల ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ క్షయ వ్యాధి పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. దగ్గు, జ్వరం ఉన్న వ్యక్తులు దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితం క్షయ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేయించుకోవచ్చన్నారు. కొత్తపేట కొండ ప్రాంతాల మీదుగా ర్యాలీ ముందుకు సాగింది. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెమలిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పెండ్లి కుమారుడైన నెమలి కృష్ణుడు

నెమలి(గంపలగూడెం): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గంపలగూడెం మండలం నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఆరురోజులపాటు జరుగనున్న వార్షిక బ్రహ్మోవాలను శనివారం వైభవంగా ప్రారంభించారు. ఆలయ సహాయ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు, ఆలయ కమిటీ చైర్మన్ కాపూరి శశిరేఖల పర్యవేక్షణలో సుప్రభాతసేవతో ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, అర్చకబృందం ప్రారంభించారు. ముందుగా శ్రీవేణుగోపాలస్వామి మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు పంచామృతాల, నవఫలరసాలతో అభిషేకం చేశారు. పెండ్లికుమారుని చేసే ఘట్టం వైభవంగా జరిగింది. ఆలయ సహాయ కమిషనర్, చైర్మన్‌లు స్వామి వారికి నూతన వస్త్రాలు సమర్పించారు. స్వామికి నూతన వస్త్రాలు, సువర్ణాభరణాలు, వివిధ రకాల పూలమాలలతో అలంకరించగా భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

నగర మార్కెట్‌లోకి మహీంద్ర ఎలక్ట్రిక్ కారు



కారును ఆవిష్కరిస్తున్న సంతోష్ కుమార్

రామవరప్పాడు: ప్రసాదంపాడులోని మహీంద్ర షోరూంలో సరికొత్త ఎక్స్‌యూవీ 400 ఎలక్ట్రిక్ కారును మహీంద్ర ఆటోమోటివ్ మాన్యుఫాక్చరర్స్ సీఈఓ సంతోష్‌కుమార్ శనివారం నగర మార్కెట్‌లోకి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ సరికొత్త ఎలక్ట్రిక్ కారు మరింత పవర్‌తో, సమర్థవంతమైన బ్యాటరీ కెపాసిటీతో రూపొందించామన్నారు. మార్కెట్‌లో లభించే ఎలక్ట్రిక్ కార్ల కన్నా ఈ కారు తక్కువ ధరలో లభిస్తుందని చెప్పారు. వినియోగదారుల సౌకర్యార్థం డెమో కార్లు షోరూమ్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెల 31వ తేదీలోగా కారును బుక్ చేసుకున్న వారికి ప్రత్యేక ధరతో పాటు మరిన్ని బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వినియోగదారులు, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్‌ఓ గుర్తింపు



మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐఎస్‌ఓ అవార్డులతో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి, అధ్యాపకులు

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్ఓ (ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్)గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాటిస్తున్న అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు గుర్తిస్తూ కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు ధ్రువ పత్రాలు ఇచ్చారన్నారు. పర్యావరణ పరిరక్షణ, విద్యుత్‌శక్తి వనరులను పొదుపు, నీటి వనరులు, వర్షపు నీరు పరిసరాల పరిశుభ్రత తదితరాలకు నిర్వహణకు గ్రీన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ అవార్డును ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో ఐఎస్ఓ మేనేజ్‌మెంట్ ఆడిట్, గ్రీన్ ఆడిట్ నిర్వహించిన హెచ్‌వైఎమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ సంస్థ కళాశాలలో సదుపాయాలను క్యాంపస్ నిర్వహణలో పాటిస్తున్న ప్రమాణాలను ప్రశంసించినట్లు తెలిపారు. సంస్థ అధినేత ఎ.శివయ్య లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్రంలో ఉన్నత ప్రమాణాలు అందుకున్న కళాశాలలో ఒకటి అన్నారు. కార్యక్రంలో అధ్యాపకులు, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నగరం నడిబొడ్డున ఠీవిగా...



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా బెజవాడ నగరం నడిబొడ్డున ఏర్పాటుచేసిన చారిత్రక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం అత్యంత అద్భుతంగా, ఠీవిగా ఉందని ప్రజలు అంటున్నారు. నగరాన్ని ఎత్తు నుంచి ఎటువైపు చూసినా అంబేడ్కర్ విగ్రహం ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. విజయవాడ నగర అందాల మధ్య కన్పిస్తున్న బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రమిది. సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఆకర్షణీయంగా ఏపీటీఎఫ్ భవనం



విజయవాడ ఏలూరు రోడ్డులోని ఇండ్ల రామసుబ్బారెడ్డి హాస్పటల్ సమీపంలో పుస్తక ఆకారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ బిల్డింగ్ ఆకర్షణీయంగా ఉంది. చూపరులను ఆకట్టుకుంటుంది. భిన్నమైన ఆకారంలో నిర్మించిన భవనాన్ని అందరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు. సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

భక్తులకు భోజనాలు





ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదాన పథకంలో భాగంగా రోజూ భక్తులకు భోజనాలు పెడుతున్నారు. గాలిగోపురం వద్ద రాత్రి వేళ కూడా భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్న చిత్రమిది. సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నేడు బాల పేరంటాలమ్మకు పసుపు, కుంకుమ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని బాల పేరంటాలమ్మ వారి గ్రామోత్సవం సందర్భంగా ఆదివారం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మకు ఆలయం తరుపున పసుపు, కుంకుమను సమర్పిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా భాను మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం బాల పేరంటాలమ్మను ఇరు గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం, సోమవారం ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామాల్లో అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం నుంచి బాల పేరంటాలమ్మకు పసుపు, కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు.



ఆలయం వద్ద ఏర్పాటు చేస్తున్న జెయింట్ వీల్, ఎగ్జిబిషన్ | ఆలయం వద్ద ఆయా డిపార్ట్‌మెంట్లకోసం ఏర్పాట్లు చేసిన టెంట్లు

గ్రామంలో వేంచేసిమెన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన తిరునాళ్ల ఉత్సవాల సందడి మొదలైంది. మార్చి 25 నుంచి 29వ తేదీవరకు ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయం వద్ద చిన్నా, పెద్దా అందరికీ వినోదాన్ని పంచే ఎగ్జిబిషన్‌లో జెయింట్‌వీల్, మ్యాజిక్‌షోలు, రకరకాల దుకాణాలు సిద్ధమవుతున్నాయి. మునేరులో భక్తులు స్నానాలు చేసేందుకు షవర్‌బాత్‌లు పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. మునేరులో భక్తులు సేదతీరేందుకు ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయం వద్ద తాత్కాలిక సమాచార కేంద్రంతోపాటు వివిధ డిపార్ట్‌మెంట్ల కోసం ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. పలు కూడళ్ల వద్ద స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. పెనుగంచిప్రోలు